
నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం-54



# కొత్త రచయితలు 'కథకులు'గా ఫెయిల్ అవుతున్నారు!

**- వాసిరెడ్డి నవీన్**


కథకుడిగా ఆయనకు గుర్తింపులేదు. కానీ ఆయనంటే కథకులందరికీ తెలుసు. ప్రజా ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నాడు. ఓ పత్రికకు దశాబ్దంపైగా సంపాదకుడిగా ఉన్నాడు. పలు కథల సంలకనాలకు సంపాదకుడిగా వ్యవహరించాడు. 1990 నుంచి ఏటేటా కథా సంకలనాలు వెలువరిస్తున్నాడు. అనేక మంది కొత్త కథకులను తయారు చేశాడు. కథకు చిరునామాగా మారి, తెలుగు కథకు కొత్త ఊపిరిలూది, కథ పట్ల రచయితలకు మమకారాన్ని పెంచిన వాసిరెడ్డి నవీన్‌తో ఇంటర్వ్యూ ఈ వారం..

## అన్నీ కమ్యూనిస్టు కుటుంబాలే!

మాది కృష్ణాజిల్లాలోని వీర్లపాడు. మా ఊర్లో అన్నీ కమ్యూనిస్టు కుటుంబాలే! ఈ ఊరు అటు తెలంగాణ ప్రాంతానికి, ఇటు ఆంధ్ర ప్రాంతానికి షెల్టర్ జోన్‌గా ఉండేది. మా ఊరిపైన 'చరిత్ర గతిలో చైతన్య వాహిని వీర్లపాడు' అనే పుస్తకం కూడా వచ్చింది. వాసిరెడ్డి సక్కుబాయి, వాసిరెడ్డి కోటేశ్వరరావు మా తల్లిదండ్రులు. మా నాన్న కమ్యూనిస్టు పార్టీలో 1959 వరకు హోల్‌టైమర్‌గా పని చేశారు. 1959 తర్వాత ఉద్యోగం వెతుక్కుంటూ గుడివాడ దగ్గరున్న గుడ్లవల్లేరు వచ్చారు. అక్కడ రైస్ మిల్లులో పని చేశారు.

## పూరిపాకలో అద్దెకు ఉండేవాళ్ళం

మాది పేద కుటుంబమే! అయితే ఆ రోజుల్లో డబ్బుతో అంత అవసరం ఉండేది కాదు. మేము గుడ్లవల్లేరులో ఓ పూరి పాకలో అద్దెకు ఉండేవాళ్ళం. కరెంటు కూడా ఉండేది కాదు. నేను ఎమ్మెస్సీ చదువుకోవడానికి హాస్టల్‌లో చేరాను. మొట్ట మొదటి సారి సీలింగ్ ఫ్యానుకింద పడుకుంది అక్కడే! గుడివాడ దగ్గర పల్లెటూరులో అమ్మమ్మ ఉండేది. సెలవులు వచ్చాయంటే అక్కడికి వెళ్ళేవాడిని. ఆ ఊరికి పడవలో వెళ్ళాలి.



భార్య, కొడుకుతో.

## డిటెక్టివ్ పుస్తకాలు విపరీతంగా చదివాను

మా ఇంట్లో వాతావరణం నాకు సాహిత్యం పట్ల ఆసక్తి ఏర్పడేలా చేసింది. నాన్న కొన్ని స్కెచ్‌లు రాశారు. అవి 'ప్రజామత'లో వచ్చాయి. చిన్నప్పుడు డిటెక్టివ్ పుస్తకాలు విపరీతంగా చదివాను. దాంతో పుస్తకాలు చదవడం బాగా అలవాటయింది. బందరులో మా పెద్దమ్మ ఉండేది. నేను టెన్త్ క్లాస్ అక్కడే చదువుకున్నాను. అక్కడ లైబ్రరీనుంచి పుస్తకాలను రెంట్‌కు తెచ్చుకుని చదివేవాళ్ళం. అప్పట్లో రోజుకు పుస్తకానికి ఐదు పైసలు, పది పైసలు అద్దె! 1960లో వాసిరెడ్డి సీతాదేవి గారి సీరియల్ 'అడవిమల్లి' వచ్చేది. నేను మొదటిసారిగా చదివిన సీరియల్ రచన అదే! మా ఇంట్లోనూ, లైబ్రరీలో మహాప్రస్థానం ఉండేది. ఆ పుస్తకం అర్థం కాకపోయినా చదివేవాడిని. అందులో ఏదో ఆకర్షణ ఉండేది.

## ఒక్క కవితే అచ్చయింది

మా చిన్నతనంలో కథలకన్నా కవిత్వమంటే క్రేజ్ ఎక్కువగా ఉండేది. నేను 1972లో ఏడాదిపాటు ఇంటిదగ్గర ఉన్నాను. అప్పుడు సృజన పత్రికకు చందా కట్టాను. గుడ్లవల్లేరులో లిటరేచర్ బ్యాచ్ ఒకటి తయారైంది. మేమంతా కవిత్వంపైనా, కథలపైనా చర్చించేవాళ్ళం. ఒక మిత్రుడు విజయవాడలో 'యజ్ఞం' కథ చదివాడట. అప్పట్లో జిరాక్స్ మిషన్లు అంతగా ఉండేవి కావు. ఆ కథను మొత్తం చేత్తో రాసి తీసుకొస్తే మేమంతా చదివాం. 'సృజన'లో పెద్దవాళ్ళ కవితలంతా వచ్చేవి. వాటిని చదివి నేను కూడా కవితలు రాసి పంపేవాడిని. ఎన్నో కవితలు రాస్తే వాటిలో ఒక్క కవిత మాత్రమే అచ్చయింది.

## బొంకులదిబ్బ వద్ద పరిచయం

బ్యాంకులో క్లర్కు ఉద్యోగం వచ్చింది. నేను ఉద్యోగరీత్యా 1977లో విజయనగరం వెళ్ళాను. అప్పటికే గురజాడ అప్పారావు రచనలు చదువుకుని ఉన్నాను. విజయనగరంలో ఆయన ఇల్లు చూసి థ్రిల్లయ్యా. అక్కడ నిష్ఠల వెంకటరావుతో పరిచయం అయింది. ఆయన ప్రోద్బలంతో 'టీ స్టాల్' అనే కథ రాశాను. నాతో పాటు మరికొందరు ఉత్తరాంధ్ర రచయితలతో కథలు రాయించి '21 సెంచరీ రైటర్స్' అనే పుస్తకాన్ని తెచ్చారాయన. తర్వాత మరో ఆరేడు కథలు రాశాను. విజయనగరంలో సాహితీ మిత్రులందరూ 'బొంకులదిబ్బ' దగ్గర కూర్చునే వారు. చాసో, పతంజలి అక్కడే పరిచయం అయ్యారు.

## 'కొండమొదలు'లో నటించాను

1978లో 'జనసాహితి' ప్రారంభమయింది. చురుకైన కుర్రాడుంటే పంపండని నిష్ఠల వెంకటరావుగారికి విజయవాడనుంచి జనసాహితి వారు ఉత్తరం రాశారు. వెంకటరావుగారు నన్ను పంపారు. 1978 నుంచి 1990 వరకు జనసాహితిలో ఉండిపోయాను. అప్పుడే నాకు సాహిత్యంతో ఎక్కువ అనుబంధం ఏర్పడింది. లిటరరీ పీపుల్ అంతా అప్పుడే పరిచయం అయ్యారు. అప్పట్లోనే యు. సాంబశివరావు రాసిన 'కొండమొదలు' నాటకాన్ని పాపికొండల దగ్గర గిరిజన గ్రామాల్లో ప్రదర్శించాం. అందులో నేనూ నటించేవాణ్ణి.

## ఆయనను పట్టుకుపోదాం పదా..

మాది పెద్దలు కుదిర్చిన పెళ్ళి. భారతితో నాకు 1979లో పెళ్ళయింది. అయితే మా పెళ్ళి చాలా తమాషాగా జరిగింది. కాట్రగడ్డ నర్సయ్యగారు మాకు సంబంధం కుదిర్చారు. కొత్తపల్లి రవిబాబుగారు మాకు పెళ్ళి చేయాల్సి ఉంది. అయితే ఆయన ఆ రోజు రాలేకపోయారు. ఇక పెళ్ళెవరు చేస్తారు అనుకుంటూ ఉండగా కాట్రగడ్డ నర్సయ్య గారు రోడ్డుమీద నడచుకుంటూ వెళుతున్న వ్యక్తిని చూపి ''అదో.. తుమ్మల వెంకట్రామయ్యగారు రోడ్డుమీద నడచుకుంటూ వెళుతున్నారు. ఆయనను పట్టుకు పోదాం పదా.. పెళ్ళిచేస్తారు'' అన్నారు. విశాలాంధ్ర ఆఫీసుకు నడచుకుంటూ వెళుతున్నాయన వచ్చి, మా పెళ్ళి చేశారు.

## 'ప్రజాసాహితి'కి ఎడిటర్ అయ్యాను

నేను విజయవాడలో ఉన్న రోజుల్లో 'ప్రజాసాహితి' పత్రికను తెప్పించుకునే వాళ్ళం. అప్పట్లో రంగనాయకమ్మగారు ఆ పత్రికకు ఎడిటర్. తను 'నిన్నటి కథ' పేరుతో పాత తరం వాళ్ళ కథలను వేసేవారు. అది మంచి ఫీచర్. విజయవాడలో 'ప్రజాసాహితి అభిమానుల సంఘం' ఏర్పాటు చేశాను. 1980లో 'ప్రజాసాహితి'కి నేను ఎడిటర్ అయ్యాను. మా మకాం

హైదరాబాద్‌కు మారింది. 'నిన్నటి కథ'ను కొనసాగించాను. పాత కథల కోసం వెదుకులాట మొదలు పెట్టాను. పాత కథలను విపరీతంగా చదివాను. అలా చదివే 'తెలంగాణ పోరాట కథలు' తెచ్చాను.

## పెద్దవాళ్ళతో పరిచయాలు..


తొలినాటి తెలుగు కథలు 1950 వరకు మధురాంతకం రాజారాంగారి సంపాదకత్వంలో రెండు సంకలనాలుగా వచ్చాయి. మిగిలిన సంవత్సరాలకు మంచి కథలను ఎంపిక చేసి వేయమని హెచ్.బి.టి. వారికి సూచించాను. వారు ఆ పని నాకే అప్పగించారు. 'తెలుగు కథ 1960-85' పేరుతో కథలను సంకలనం చేశాను. ఈ పుస్తకం కోసం కథలు సేకరించడానికి చాలా ఇబ్బంది పడ్డాను. ఎందరో రచయితలను కలిశాను. ఎన్నో లైబ్రరీలు తిరిగాను. ఈ పని 1985లో మొదలు పెడితే 1990కి పూర్తయింది. ప్రతి ఏడాది ఉత్తమ కథలతో ఒక సంకలనం ఉంటే ఇంత ఇబ్బంది ఉండేది కాదు కదా అనిపించింది. దీంతో నేను పాపినేని శివశంకర్‌తో కలసి 1990 నుంచి ఏటా కథా సంకలనాలు తెస్తున్నాను. వయసులో చిన్నవాడినే అయినా చాలా పెద్దవాళ్ళతో పరిచయాలు ఏర్పడ్డాయి.

## నచ్చినవి

| | | |
|---|---|---|
| కథ | : | ఫోర్త్ డైమెన్షన్ (కా.కు.) |
| నవల | : | ప్రజల మనిషి (వట్టికోట అళ్వారు స్వామి) |
| కథకుడు | : | కొడవటిగంటి కుటుంబరావు |
| కవి | : | అప్పుడు శ్రీశ్రీ, ఇప్పుడు శివారెడ్డి |
| పాట | : | అందమె ఆనందం ఆనందమె జీవిత మకరందం |
| సినిమా | : | మాయాబజార్ |
| నటుడు | : | ఎన్.టి.ఆర్. |
| నటి | : | సావిత్రి |
| గాయకుడు | : | తెలుగులో ఘంటసాల. హిందీలో ముఖేష్ |
| వ్యక్తి | : | ఇంగ్లీషు మాస్టారు సుబ్బారావుగారు |
| వంట | : | వంకాయకూర |

## పోలీసులు వెంటపడేవారు

సాహిత్యం అంటే ఏమిటో తెలీని రోజుల్లోనే సాహిత్యంలో తలమునకలై పోవాల్సి వచ్చింది. 26 ఏళ్ళకే పత్రికా సంపాదకత్వం వహించాను. కె.శివారెడ్డి, చలసాని ప్రసాద్‌రావు, హరిపురుషోత్తం, చేరా నాకు బాగా సన్నిహితులయ్యారు. 'ప్రజాసాహితి'కి సంపాదకుడిగా ఉన్న రోజుల్లో రోజూ పోలీసులు నా వెంటపడేవారు. నేను బ్యాంకుకు వెళ్లినా సరే, అక్కడకు వచ్చి నన్ను గమనిస్తూ కూర్చునేవారు.



కె.శివారెడ్డి, పాపినేని శివశంకర్‌తో...

## నా కెరీర్ అంతా సాహిత్యమే!

జీవిక కోసం ఉద్యోగం ఉంది. చాలనుకున్నాను. ఉద్యోగంలో నేను కెరీర్‌ను వెతుక్కోలేదు. నా కెరీర్ అంతా సాహిత్యమే అనుకున్నాను. ప్రమోషన్ కోసం ఏ ఒక్క ఎగ్జామ్ కూడా నేను రాయలేదు. నాతో పాటు ఉద్యోగంలో చేరిన వారంతా ఇప్పుడు డి.జి.ఎం.లు, జి.ఎం.లు అయ్యారు. పుస్తకాలు చదువుకోవడం, పుస్తకాలు వేయడంలోనే నాకు ఆనందం. నేను చేయాల్సిన పనికూడా అదే!

## చెత్తకథ రాస్తానేమో అని భయం

ఇన్నేళ్ళగా ఎన్నో కథలు చదివాను. చదువుతున్నాను. తొలి రోజుల్లో నేను కూడా కథలు రాసినప్పటికీ అవేం చెప్పుకోదగ్గవి కాదు. ఇప్పుడు నాక్కూడా కథలు రాయాలని అనిపిస్తూ ఉంది. చాలా ఏళ్ళగా మంచి కథ, చెత్త కథ అని నిర్ణయిస్తున్నాను కదా. ఇప్పుడు నాకు కథ రాయాలంటే భయంగా ఉంది. ఇన్నేళ్ళ తర్వాత ఇప్పుడు నేను చెత్త కథ రాస్తానేమో అనే భయం ఉంది. మంచి కథ రాస్తాను. ఎప్పుడో తెలీదు.

## జీవితానుభవం ఒక్కటే సరిపోదు..

నాలుగైదేళ్ళగా నాకు ఇప్పటి కథకులపైన తీవ్ర అసంతృప్తి ఉంది. కొత్త కొత్త జీవితాలు, వస్తువులు కథలుగా వస్తున్నాయి. అయితే వీరు ఆ వస్తువులను కథలుగా మలచడంలో ఫెయిల్ అవుతున్నారు. చాలామంది లోతుల్లోకి పోకుండా కథను పైపైనే రాసేస్తున్నారు. అందువలన ఇప్పటి కథలు ఫెయిల్ అవుతున్నాయి. ఇప్పటి జీవితాల్లో అనేక కోణాల్లో వచ్చిన మార్పుల్ని కథకులు ఎందుకు పట్టుకోవడం లేదు? వాటినెందుకు కథగా మలచడం లేదు? కొందరికి జీవితానుభవం చాలా ఉంది. అయితే వీరు కూడా పుస్తకాలను ఎక్కువగా చదవడం లేదు. జీవితానుభవం ఒక్కటే కథ రాయడానికి సరిపోదు. అధ్యయనం కూడా తప్పనిసరి. ఇంగ్లీషులో చదవలేకపోయినా ఇంగ్లీషునుంచి వచ్చిన అనువాదాలు చాలా ఉన్నాయి. పాత తరం తెలుగు కథలున్నాయి. కనీసం వాటిని చదవాలి. చదివిన అనుభవం-జీవితానుభవం కలిపి కథలు రాయాలి. అప్పుడే కథలు బాగా వస్తాయి.

## సాహిత్యంలో గ్యాప్ వచ్చింది

'వస్తువు'ను బట్టే టెక్నిక్ ఉంటుంది కానీ, టెక్నిక్ కోసం కథ రాయకూడదు. అలా చేస్తే కథ ప్రయోజనం నెరవేరదు. ఈ మధ్య సాహిత్యంలో గ్యాప్ వచ్చింది. క్రియేటివిటీ ఉండే వాళ్ళంతా వేరేవేరే రంగాల్లోకి వెళ్ళిపోయారు. టీవీల్లో యాడ్స్ చూడండి, ఎంత కొత్తగా క్రియేటివిటీగా ఉంటున్నాయో. అయితే కొంతకాలానికి అందులో మొనాటనీ వస్తుంది. రచయితలంతా మళ్ళీ వెనక్కు వస్తారు. క్రియేటివిటీ ఈజ్‌ది పార్ట్ ఆఫ్ హ్యూమన్ లైఫ్, పార్ట్ ఆఫ్ అవర్ సొసైటీ. కొత్త జనరేషన్ పుట్టుకు రావాలి. వస్తారు కూడా. అయితే అలాంటి వాతావరణాన్ని మనం తయారు చేయాలి.

**-సుంకోజి దేవేంద్రాచారి**

వాసిరెడ్డి నవీన్‌కు నచ్చిన కథ

# పేపర్ టైగర్

- ఎన్.ఎస్.ప్రకాశరావు

“ఈ వర్షం ఇప్పుడిప్పుడే వదిలేలాగ లేదబ్బాయ్!'' అన్నారు నరసింహం గారు, కిటికీలోంచీ బయటికి చూస్తూ, ఆయనకి చాలా చిరాగ్గా ఉంది.

‘నువ్వు ఇప్పుడిప్పుడే నన్ను వదిలేలాగ లేదబ్బాయ్!’ అన్నట్టు విన్పించింది అబ్బాయ్‌కి. అబ్బాయ్ పేరు వర్రపసాద రావు. అతనా గదిలో ఒక సోఫాలో కూర్చున్నాడు. కూర్చున్నాడనడం కంటె సోఫాని ఆనుకుని గోడకుర్చీ వేసేడనడం సబబు. తను కూర్చుంటే సోఫాకి ఏం నొప్పెడుతుందో, ఏ కుళ్ళు అంటుకుంటే నరసింహంగారు ఏం చేసేస్తారో అని భయపడుతున్న వాడిలా ఉన్నాడతను.

ఆ సాయంకాలం అతను నరసింహంగారింటికి వస్తూ ఉంటే, అల్లంత దూరంలో ఉండగానే టపటపా చినుకులు పడ్డం ఆరంభించాయి. వాళ్ళింటికి వచ్చేసరికి అతని చొక్కా ఒంటికి అతుక్కుపోయింది. ఎత్తుగా దువ్విన జుత్తు అణ గారిపోయి బుర్రకి అంటుకుపోయింది. నీళ్ళతో కలిసి, నూనె తలమీంచి కారి మొహమంతా జిడ్డులా తయార యింది. నరసింహం గారి ఇంటికి వచ్చాక మెట్లెక్కి, వరండాలో నుంచుని రుమాలుతో తల తుడుచుకోవాలో, మొహం తుడుచుకోవాలో తేల్చు కోలేక మోచేతులు తుడుచుకుంటూ కాలింగ్ బెల్ నొక్కాడతను.

ఆ సమయంలో నరసింహంగారొక్కరే ఇంట్లో ఉన్నారు. ఆయన కొడుకూ, కోడలూ, మనవలూ అంతా ఏదో పార్టీకి వెళ్ళారు.

కాలింగ్‌బెల్ విని ఆయనే తలుపుతీశాడు. తలుపు తియ్యగానే చామన చాయవాడు. జిడ్డుమోము వాడు. రెండుపదుల వయసువాడు, బక్క పలు చనివాడు, వరప్రసాదు కనిపించాడు. అతని రూపురేఖా విలాసాలు చూశాక, లోపలకు రమ్మనాలో, బైటే ఉంచే ‘ఎవరికోసమని’ అడగాలో తేల్చుకోలేక డోర్‌నాబ్ పట్టుకొని ఒక్కక్షణం అలా నిల్చుండి పోయాడాయన.

నరసింహంగారిని చూడగానే వరప్రసాదరావు నోరుపెగల్లేదు. పెద్దపు లిని చూసినట్టు ఒక్కసారి జడుసుకున్నాడు. కనిపించగానే వినయంగా నమ స్కారం చెయ్యమని మరీమరీ చెప్పి పంపించిన తాతగారి మాటే మర్చిపో యాడు. నరసింహంగారి మొహం చూస్తూనే ఎందుకోగాని గాభరాపడిపో యాడా కుర్రవాడు.

నరసింహంగారికి ముఖంలో రంగులు మార్చడంలో ఒక ప్రాక్టీసు ఉంది. ఆయన తన చిన్నమనవడితో ఆడుకుంటున్నప్పుడు ఎంతగాబోసి నవ్వులు చిందిస్తాడో, అదే సమయంలో పని కుర్రాడితో మాట్లాడవల సొస్తే అంత కటువుగానూ ఉండగలడు. పూర్వం కూడా తన క్లయింట్ల తోనూ, జడ్జీల తోనూ ఎంత మృదుమధురంగా మాట్లాడేవాడో తమ ఊళ్ళో రైతులతోటీ, కూలీల్తోటీ అంత కర్కశంగా మాట్లాడేవాడాయన. ఎవడైనా కొత్తవాళ్ళను చూసీ చూడంతోటే, విధిగా ఆయన ముఖంలో రంగులు మారతాయి. అవ తలవాణ్ణి చూస్తూనే ఒక అంచనావేసుకొంటాడు. దాంతో ముఖం ప్రస న్నంగా పెట్టడవా, గంభీరంగా పెట్టడవా, ప్రసన్న గంభీరంగా పెట్టడవా అన్నది తేల్చుకొంటాడు.

కాని వరప్రసాదరావుని చూసి ఎలా ముఖం పెట్టాలో ఆయనకి వెంటనే తెలియక తటపటాయించాడు.

ఇంతలో ఆ కుర్రవాడు జేబులోంచి ఓ ఉత్తరం తీసి ఇచ్చాడు. అది చూస్తూనే, అయోమయపు రంగులోంచి కొంచెం ప్రసన్నపు రంగులోకి మొహాన్ని మార్చుకొన్నాడు నరసింహంగారు.

“రా లోపలికి'' అన్నాడాయన.

తను వచ్చిన పని సగం అయినట్టేననిపించి, చిన్న పొంగు పొంగి పోయాడు వరప్రసాదరావు.

కాని, వెంటనే నరసింహంగారు “జోళ్ళు...'' అంటూ అర్థాంతరంగా ఆగి పోవడంతో ఒక్కసారి కుంగిపోయాడా అబ్బాయి. ఆ కుర్రవాడి జోళ్ళు చిరు బురదతో ఉన్నాయి. ‘ఆయన చెప్పబట్టి సరిపోయింది కాని, అమ్మ బాబోయ్! ఆ జోళ్ళతో లోపలికి వచ్చేస్తే ఇంకేవన్నా ఉందా?’ అనుకొని మన సులోనే ఫెడీఫెడీమని లెంపలు వాయించేసుకున్నాడు వరప్రసాద రావు.

జోళ్ళు బైటే వదిలి, లోపలికివచ్చి సోఫా ముందు గోడ కుర్చీ వేశాడా కుర్రవాడు. “సరిగా కూర్చో ఫరవాలేదు'' అందామని నోటిదాకా వచ్చింది కాని మరెంచేతో నరసింహంగారు అనలేదు.

ఆ కుర్రవాడి తాతగారూ, నరసింహంగారూ చిన్నప్పుడు క్లాస్‌మేట్స్, ఆ రోజుల్లో వాళ్ళిద్దరూ. ‘చదువు లేకపోతే మన బతుక్కి మరో దారీ తెన్నూ

లేదు. చదువుకోకపోతే మట్టికొట్టుకుపోతాం సుమా, అనుకొని కష్టపడి చదువుకొన్న వాళ్ళే కాని, పెద్దలు చెప్పినట్లు రోజులు అందరికీ ఒక్కేలా వుండవు కదా!

నరసింహంగారికి రోజులు మారాయి. దశ మళ్ళింది. ఆ రోజుల్లో కుర్ర నరసింహాన్ని చూసి, తన బాగుకోసం, అవసరం వస్తే, 'అమ్మలేదు, నాన్న లేడు, అన్న, చెల్లి ఎవరూ లేరు లేరంటే లేరు' అని ఈ కుర్రవాడు అనుకోగలడని ఎలా పసిగట్టారోగాని, పసిగట్టేరొక పెద్ద ప్లీడరు గారు. అంత చిన్న వయసులోనే ఆ కుర్రవాడికి జ్ఞానోదయం కలిగినందుకు తెగ మురిసిపోయాడాయన.

ఆ తరువాత నరసింహంగారు, ఆ ప్లీడరు గారింటికి ఇల్లరికపుటల్లుడుగా వెళ్ళాడు. మద్రాసుకి 'లా' స్టూడెంటుగా వెళ్ళాడు. కోర్టుకి మావగారి జూనియర్‌గా వెళ్లాడు. ఆ తరువాత ఎన్నెన్నోచోట్లకి ఎంతో గొప్పగా, గర్వంగా వెళ్లాడు.




నరసింహంగారికి భగవంతుడంటే చెప్పలేనంత భక్తి, కాని ఆయనకి మావగారంటే అంతకన్న ఒక్క పిసరు ఎక్కువ భక్తి. ఆయన పావుగంట సేపు మాట్లాడాడంటే అందులో అరగంట సేపు మావగారి గురించి రెఫరెన్సే ఉంటుంది.

నరసింహంగారికిప్పుడు ముగ్గురంటే ముగ్గురే మగపిల్లలు. ఆయన పెద్ద కొడుకు బొంబాయి దగ్గర ఏదో ఆయిల్ రిఫైనరీలో జనరల్ మేనేజర్ హోదాకి ఒకే ఒక మెట్టు కింద ఉన్నాడు. అందుగురించి నరసింహం గారెప్పుడూ చిరాకుపడుతూనే ఉంటారు. రెండోకొడుకు ఆ ఊళ్ళోనే యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా ఉన్నాడు. అతను ఇప్పట్లో ప్రొఫెసరవాలంటే, ఇప్పుడు ప్రొఫెసరుగా ఉన్నాయన హఠాత్తుగా హరీమనడం ఒక్కటే మార్గం.

అది తల్చుకున్నప్పుడల్లా నరసింహంగారికి ఆ ప్రొఫెసర్ పీక పిసికేద్దామా అన్నంత కోపం వస్తూంటుంది. మరి మూడోవాడు అమెరికాలో రీసెర్చి చేస్తున్నాడు. అమెరికాలో స్టూడెంట్ రివోల్ట్ గురించి ఎప్పుడయినా పేపర్లో చూసినప్పుడు కించిత్తు గాభరా పడినా, మొత్తం మీద నరసింహంగారికి ఆ చిన్నవాణ్ణి గురించిన చింతేమీ లేదు.

అదే సమయంలో నరసింహంగారి పుట్టింటివాళ్ళ దశ కూడా మారింది. చదువు, చదివి నాలుగురాళ్ళు సంపాదించి, కుటుంబాన్ని లేవనెత్తుతాడనుకున్న నరసింహం నడి సముద్రంలో సంసారాన్ని వదిలి పూలపడవలో తన మానాన్న తను పారిపోతే – ఆయన పెద్ద చెల్లెలు చాలాకాలం పెళ్ళికాక అలా ఉండిఉండి ఆఖరికి ఉరి పోసుకు చచ్చి పోయింది. రెండో చెల్లి ఎవరో ముసలి ప్లీడరుగారికి మూడో భార్యగా వెళ్ళిపోయింది. ఆయన అన్నయ్య టీబీతో తీసుకొని తీసుకొని ఆమధ్యనే పోయాడు. అన్నగారి భార్యా, పిల్లలు అంతా ఎక్కడుంటున్నారో, ఏమయిపోయారో ఎవరికీ తెలియదు. తండ్రి



చిన్నప్పుడే పోయినా నరసింహంగారి తల్లి మటుకు చాలాకాలం పీనుగు బతుకు బతికింది. ముసలి ముద్దయిపోయి, పక్కమీద బట్ట మార్చినవాళ్ళు లేక, ఆఖరవస్థలో మరీఘోరంగా రోజుకి నలభైసార్లు మంచం దింపేస్తూ ఉంటే, వీధరుగు మీద పారేస్తే బతికుండగానే చీమలు పట్టిపోయి, ఈగలు ముసిరిపోయి, దెయ్యపు చూపు వచ్చేసి, మందుమాకుల్లేక, చల్లని మాటమా టాడే మనిషి లేక, నానా యాతనా పడి ఆవిడ ఆఖరికి ఆ దీన బాంధవుడి సన్నిధి చేరుకొంది.

మరి అదే సమయంలో వరప్రసాదరావు తాతగారి దశ కూడా మళ్ళింది. హఠాత్తుగా తండ్రి చనిపోవడంతో ఇంటరుతోనే చదువాపేశాడాయన. ఆ తరువాత చిన్నచిన్న ఉద్యోగాలు చాలా చేశాడు. 'పిల్లకింత తిండి పెట్ట గలి గినవాడు చాలు' అనుకొంటున్న మేనమామ కూతుర్ని పెళ్ళి చేసుకున్నాడు. ఆయనకిద్దరు కూతుళ్ళు, ఒక కొడుకు.

కొడుకు ఏదో ఫేక్టరీలో పనిచేస్తూ నిచ్చెన జారి, నీళ్ళటాంకులో పడి చచ్చి పోయాడు. ఫేక్టరీ యజమానులు మురిపించి మురిపించి ఇచ్చిన కాంపెన్సే షను చేజిక్కించుకొని, అతని భార్య పుట్టింటికి చేరింది. రెండో కూతురు కాపరం ఫరవాలేదు కాని, పెద్దదాని మొగుడికి స్థిరం లేదు. అతను నెల్లాళ్ళు ఉద్యోగం చేస్తే, రెండె నెలలు ఇంట్లో కూర్చుంటాడు. రెండు నెల్లు ఇంట్లో కూర్చుంటే నాలుగు నెలల పాటు ఎక్కడికి పోతాడో ఏవిటో పత్తాలేకుండా పోతాడు. వాళ్ళకి అయిదుగురు పిల్లలు. పెద్దవాడు వరప్రసాద రావు.



వరప్రసాదుణ్ణి వాళ్ళ తాతగారే బియస్సీ దాకా చది వించారు. ఆకాడి బ్రహ్మాండమై పోయింది. అంతకి మించి ఆయనకీ శక్తిలేదు. అందుకే వరప్రసాదరావు ఉద్యోగప్రయత్నం మొదలు పెట్టాడు. ఏడెనిమిది నెల్ల పాటు, అతను ఉద్యోగం కోసం చెడ తిరిగాడు. ఇతను ఉద్యోగం అడిగినచోటల్లా, వాళ్ళు ఇతన్ని లంచం అడి గారు. రికమండేషన్ లెటరడిగారు. రెండూ అక్కర్లేని వాళ్ళు కులం అడిగారు. కులం సరిపోయిన చోట శాఖ అడిగారు. అన్నీ అడిగారు కాని ఇతనడిగింది మట్టుకు ఇవ్వలేదు.

అలాంటప్పుడు గోదావరి వరదలో కొట్టుకుపోతున్న వాడికి, గడ్డికుప్ప దొరికినట్టు నరసింహంగారు గుర్తుకొ చ్చారు. ఆయన్ని గురించి తాతగారు చెప్పింది వింటూ ఉంటే, కల్పవృక్షమో, కామధేనువో మన తాతగారి బెస్ట్ ఫ్రెండ్ అన్నట్లు ఫీలయ్యాడు వరప్రసాదరావు. మనవడి చేతికి ఉత్తరం ఇచ్చి పంపించారు తాతగారు.

'ఈ బాలకుడు నా మనవడనీ, వీడి తండ్రికి స్థిరం లేదనీ, అందువల్ల తల్లీ నలుగురూ పిల్లలూ మలమల మాడిపోతున్నారనీ, మీ పిల్లల ద్వారా కానీ, మీకు తెలి సిన పెద్దవాళ్ళ ద్వారా కాని చిన్నదైనా సరే, ఏదో ఉద్యోగం ఒకటి ఇప్పిస్తే, చచ్చి మీ కడుపున పుడతాననీ, ఈ ఉపకారం చేసిపెట్టి నందుకు ఆ అనాథరక్షకుడు మీకు ఇందుకు వెయ్యి రెట్లు మంచి చెయ్యక పోడనీ, స్వయంగా వచ్చి కష్టసుఖాలు చెప్పుకొందికి తన కాళ్ళు స్వాధీనం లోకి రావడం లేదనీ' ఆ ఉత్తరంలో ఉంది.

***

వరప్రసాదరావు సోఫాలో సరిగా కూర్చుందామని రెండు మూడు సార్లు అనుకొన్నాడు కాని ఎందుకో భయపడిపోయాడు. తలెత్తిచూశాడు. నరసింహంగారు ఉత్తరం చదువుతున్నాడు. ఆయన వెనకాల గోడ మీద ఫొటో చూసి గతుక్కుమన్నాడా కుర్రవాడు.

ఆ ఫొటో అందమైన ఫ్రేములో బిగించి ఉంది. అది ఎవరో పెద్దమనిషి ఫొటో, ఆ పెద్దమనిషి ముఖం గంభీ రంగా పెట్టబోయి, భయంకరంగా పెట్టినట్టు ఉంది. పెద్ద తలపాగాతో ఆయన తల రెండింతలు పెరిగినట్టు కనిపిస్తోంది. దోసగింజంత బొట్టు, ఆయన కనుబొమల మధ్య మెరుస్తోంది. ఎక్కుపెట్టిన ఆయన మీసాలు, ఎవ

## ధిక్కార స్వరం



విరసం ఏర్పడిన తొలి రోజుల్లో కథలు చాలా పచ్చిగా వచ్చేవి. అంటే కొట్టు, నరుకు, చంపు అనే ధోరణిలో కథలుండేవి. వీటికి భిన్నంగా చాలా మామూలుగానే కథ నడుపుతూ, ధిక్కారాన్ని అద్భుతంగా చెప్పిన కథ 'పేపర్ టైగర్'. మధ్య తరగతిని ఎప్పటికైనా సరైన దారిలో నడిపించేది అట్టడుగు వర్గాల్లో ఉన్న తెగింపే! అది ఈ కథలో ఉంది. అందుకే ఈ కథంటే నాకిష్టం.

**-వాసిరెడ్డి నవీన్**

**9849310560**

---

రివో తెచ్చి అతికించు కున్నట్లు వికృతంగా ఉన్నాయి. నల్లటి చీకటి కోటులోంచి బయటకు వచ్చిన ఆయన కంఠం, తెల్లగా సున్నం వేసుకొన్నట్లు ఉంది.

మొత్తం మీద ఆ ఫొటోలో ఉన్న విశేషం ఏమిటోగాని దానివేపు మరొక్క మారు చూడ్డానికి భయపడ్డాడు వరప్రసాదరావు.

నరసింహంగారు ఉత్తరం చదివి, మడిచి టీపాయ్ మీద పెడుతూ ఒక నిట్టూర్పు విడిచాడు. పరధ్యానంగా ఉన్న వరప్రసాదరావు ఫొటోలో ఉన్నాయనే నిట్టూర్చాడనుకొని ఉలిక్కిపడ్డాడు.

''అయితే, ఇప్పుడు మీ తాతకి ఒంట్లో కులాసాగానే ఉందా? అఫ్‌కోర్స్ ఓల్డ్‌ఏజ్. నా ఈడు వాడు. నాకు ఈ మధ్య ఒంట్లో బావుండటం లేదబ్బాయ్! మా పిల్లలు ఇంకా మీరు కోర్టుకి వెళ్ళడం ఏవిటి నాన్నారూ!' అంటే ఏణ్ణర్థం నుంచి ప్రాక్టీసు వదిలేశాను... మీ తాత ఇంకా ఏదైనా పని చేస్తున్నాడా?'' ... అని ఏదో ఆలోచిస్తున్నవాడిలా ఆగిపోయాడు నరసింహం గారు.

వరప్రసాదరావు ఏం మాట్లాడలేదు. అతనికిందాకట్నించి చేతులు ఎక్కడ పెట్టుకోవడమన్నది పెద్ద సమస్య అయిపోయింది. సోఫా మీద చేతులు పెట్టడానికి అతనికి భయంగా ఉంది. ముణుకుల మీద పెట్టుకుంటే కూర్చోవడం కష్టంగా ఉంది.

దానికితోడు – రాగానే నమస్కారం చెయ్యలేదన్న విషయం, అతనికీ హఠాత్తుగా గుర్తుకి వచ్చింది. మహాపాపకార్యం ఏదో చేసినట్లు భయపడిపోయాడు. ఇప్పుడు మధ్యలో నమస్కారం చేస్తే ఏం బావుంటుంది? మరింక ఉండబట్టలేక పైకే 'ప్చ్' అనేశాడు.

''నేను ఎవరితో చెప్పాలంటే వాళ్ళతో చెప్తానబ్బాయ్! కాని చూడు, వెధవ రోజులెలా ఉన్నాయంటే, మనెదురుగుండా, 'అలాగే సార్! తప్పకుండా', అన్న వెధవలే వెనకాతలకెళ్ళి మనమాటే మర్చిపోతారు. పూర్వపు రోజులు కావు గదా, ఓ మాట అన్నారూ అంటే దానిమీద నిలబడతారు అని నమ్మడానికి. నాకేవిటంటే ఓసారి చెప్పినతరవాత అది జరక్కపోతే నన్నే ఇన్సల్ట్ చేసినట్టు ఫీలవుతాను. అడిగి లేదనిపించుకోవడంకంటె, ఊరుకోవడం ఉత్తమం అనిపిస్తోంది నాకు వీళ్ళని చూస్తుంటే... పోనీ మావాడితో చెప్దాం అంటే, అనడానికి మావాడు అసిస్టెంటు ప్రొఫెసరే అనుకో కాని, వాడి నెత్తి మీద మరో వెధవ ఉన్నాడు కదా! నా అనుమానం మా వాడి చేతిలో ఏమన్నా ఉందా అని! వాడిప్పుడు ఇంట్లో లేడు. అంతా ఆ ప్రొఫెసరింటికే, వాడి కొడుకు కోడలూ వెస్ట్ జర్మనీ నించి తిరిగొస్తే చూడ్డానికి వెళ్ళారు. తప్పదుకదా మరి! మనవాడు చెయ్యగలిగిన పనైతే నిమిషాల మీద చేయిస్తాను. ఈ కాలపు కుర్రవాళ్ళలా కాదు. ఇప్పటి క్కూడా, వాళ్ళంతటి వాళ్ళయిపోయాక కూడా, నన్ను కన్సల్ట్ చెయ్యందే ఒక్క పనీ చెయ్యరు..'' అని మళ్ళీ ఆగిపోయాడాయన.

తనేం మాట్లాడాలో తెలియక ఊరుకున్నాడు వరప్రసాద్... ఇంతకీ ఈ ముసలాయన ఎవరితోనైనా చెప్తాడా, చెప్పడా? కర్ర విరుగుతుందా, పాము ఛస్తుందా? ఈ గోడ మీద పిల్లి ఎటు దూకుతుంది? అటా, ఇటా? మొహమంతా జిడ్డు కారుతూ చిటపట లాడుతోంది వరప్రసాదరావుకి. కాని తుడుచుకొంటే స్టయిలుగాడనుకుంటారో, ఏమిటో అనుకున్నా డతను.

''ఈ రోజుల్లో వెధవ కరువు అన్నిటికీ కరువే! తిండికీ కరువే, ఉద్యోగాలకీ కరువే! ఐ టెల్ యూ వన్‌థింగ్. నేనింత చదువుకొన్నాను, అంత చదువుకొన్నాను. నాకీ ఉద్యోగం సరిపోదు, అనుకొంటే మరి లాభం లేదబ్బాయ్! ఏదో ఒకటి పని చెయ్యడానికి సిద్ధంగా ఉండాలి. టు టెల్యూ ఫ్రాంక్లీ – నా పిల్లలెవరికీ కూడా నేను జాబ్స్ కోసం ట్రై చెయ్యలేదు. కావాలన్నంత వరకు చదువులు చెప్పించాను. ఆ తరువాత వాళ్ళ అదృష్టం బావుంది. భగవంతుడి దయవల్ల వాళ్లే, ఏవో మంచి ఉద్యోగాలే సంపాదించు కొన్నారు... ఎవ్వళ్లూ నాకేవీ పంపించక్కర్లేదు. మొన్నమొన్నటిదాకా, నేనూ మా ఫాదరిన్లా ఇక్కడే ప్రాక్టీసు చెయ్యడం చేత ఈ ఊరొదిలి ఉండటం నాకిష్టం ఉండదు. కాని నా పెద్దకొడుకూ, పిల్లలూ 'గ్రాండ్ పాపా! మా ఇంటికి రండి రండి' అని పిలుస్తారు. కొన్నాళ్ళు బాంబే వెళ్ళి వాళ్ళతో ఉంటాను. మరింక మూడోవాడు. 'ఎప్పుడూ ఆ ఇద్దరన్నయ్యల దగ్గిరేనా ఉంటారు? నాతోపాటు అమెరికా వచ్చెయ్యండని,' ఒకటే ఉత్తరాల మీద ఉత్తరాలు దంచేస్తున్నాడు... నువ్వు నా యంగెస్ట్ సన్‌ని ఎరుగుదునా...?'' అని ఆగాడు నరసింహంగారు.

తమ చిన్నకుమారుని తల్చుకోవడం వల్ల కాబోలు, ఆయన ముఖంలో చిన్నదరహాస రేఖ మెరిసింది.

ఉన్నట్లుండి గదంతా చీకటయిపోయింది. బైటవాన కురుస్తూనే ఉంది. వరప్రసాదరావు కూర్చున్న సోఫామీద, వెనకాతల కిటికీలోంచి చిన్న తుంపర పడుతోంది.

''గొప్ప స్మార్ట్ ఫెలోలే! చిన్నప్పుడు వాళ్ళ తాతగారు, 'పెద్దయ్యాక నువ్వేం చేస్తావురా తాతా?' అని అడిగితే, 'నేను అమెరికాపోతాను తాతగారూ' అనేవాడు. సిల్లీ ఫెలో చిన్నప్పుణ్నుంచి వాడు అదేమిటో, 'అమెరికా పోతాన్, అమెరికా పోతాన్' అంటూ ఉండేవాడు. అఫ్‌కోర్స్ హీజ్ లక్కీ! భగవంతుడి దయవల్ల వాడికి స్టేట్స్‌లో సీటొచ్చింది. స్కాలర్‌షిప్ ఇవ్వనన్నారు. 'పొండి వెధవల్లారా! దరిద్రులకీ, ముష్టివాళ్ళకీ మీ స్కాలర్‌షిప్‌లు కానీ, నా కొడుక్కేం ఖర్మ కాలింది' అని నేను పంపించేశాను.... గొప్ప తమాషా ఏవిటంటే, అసలు వాడు వెళ్ళేవరకూ నాకు తెలీదు. నేను కోప్పడతానని నాతో చెప్పకుండానే వాడు అప్లయి చేశాడు. సీటొచ్చిన తరువాత, 'నాన్నారూ వెళ్తాను', అని నా దగ్గర గునిసేడు. వై షుడ్ కమిన్ హిజ్ వే? బావుపడతాన్నాన్నా అంటే వద్దనే ఫాదరెవడైనా ఉంటాడా? వెంటనే పంపించేశాను. ఆ తరువాత నాకిక్కడే అన్ని ఫెసిలిటీస్ ఉన్నాయి. ఇక్కడే సెటిలయిపోతాను నాన్నారూ! అన్నాడు. సరేనయ్యా అన్నాను... ఇదిగో చెప్తున్నానబ్బాయ్! ఇది మన ఊరా, అది కాకపోయిందా? ఎక్కడో ఓ చోట హాయిగా, సుఖంగా బతికితే అంతే చాలు. ఇక్కడకన్నా సుఖంగా ఉంటుందంటే, చంద్ర మండలానికి పోతానన్నా నేను వద్దన్ను. మూడేసేళ్ళకోసారి మనవేపు వస్తూనే ఉంటాడు. ఎందుకు, ఏం బావుకోవాలని రావడం చెప్పు? వేలకి వేలు ఎయిర్ సర్వీసెస్‌కి పొయ్యడం తప్పిస్తే?! అయినా, ఏవిటో ఎక్కడికి పోయినా, మనవాళ్ళూ అంటే అభిమానం పోకపోవడమనే పిటీ!'' అని గుక్క తిప్పుకున్నాడు నరసింహంగారు.

అమెరికాలో ఉన్న ఆ తృతీయ పుత్రరత్నాన్ని కళ్ళారా చూడలేకపోయినందుకు నొచ్చుకున్నాడు వరప్రసాదరావు. ఒక్క ఘడియ అతను, తన ఇంటినీ, ఇంటికి రాని తండ్రినీ, మంచం వదలని తాతగారినీ, ఏడుపు ఆ పని అమ్మనీ మర్చిపోయి, నరసింహంగారే తన తాతగారైతే ఎంత బావుండునో కదా! అనుకున్నాడు. అందులోకి నరసింహంగారు తన కుటుంబ వ్యవహారాలన్నీ తనతో ఇంత ఇంటిమేట్‌గా చర్చించడం, తన్ని ముగ్ధుణ్ని చేసింది. అంత పెద్దాయన తనొచ్చినందుకు విసుక్కోవడం లేదు. అదే చాలు అనిపించిందతనికి.

వరప్రసాదరావు వీపు మీద వానజల్లు ఉండుండి పడుతోంది.

అంతకంతకీ వాన ఎక్కువయిపోతోంది. చిన్న మెరుపు మెరిసింది.

''జల్లు కొట్టేస్తోందబ్బాయ్!'' అన్నాడు నరసింహంగారు. అని, ఒక్క క్షణం వరప్రసాదుడివైపు చూశాడు.

'అవున్నిజవే! జల్లు కొట్టేస్తోంది' అన్నట్లు బుర్ర ఊపాడు ప్రసాదరావు. చిన్న విసుగులాంటి మూలుగుతో, సోఫాలోంచి లేచాడు నరసింహం గారు.

చుట్టూ తిరిగి వెళ్ళి, ప్రసాదరావు వెనకాతల ఉన్న కిటికీ అద్దాల తలుపులు మూసేశాడు.

అద్దాల తలుపుల్లోంచి బయటకు చూస్తూ ''ఈ వర్షం ఇప్పుడప్పుడే వదిలేలాగ లేదబ్బాయ్!'' అన్నారు నరసింహంగారు.

ఎక్కడో దూరంగా పిడుగు పడింది.

'నువ్విప్పుడప్పుడే నన్ను వదిలేలాగ లేవబ్బాయ్!' అన్నట్టే వినిపించింది వరప్రసాదరావుకి, ఉన్నట్లుండి అతని వెన్నుపూసలోంచి వణుకు ఆరంభమైంది.

బయట – హోరున వాన కురుస్తోంది. ఉండుండి ఆకాశం పెద్ద వెలుగుతో చీల్చుకొంటోంది. దూరంగా గేటవతల వీధిలో దీపస్తంభానికి కట్టిన గేదె ఒకటి తడిసిపోతోంది. దానిముందు వేసిన గడ్డిపరకలు నీళ్ళలో కొట్టుకుపోతూ ఉంటే, వెర్రిముండలా చూస్తూ ఉండిపోయిందా గేదె. ఎక్కణ్నించో కుక్కపిల్ల ఒకటి తడిసిపోయి, చలికి కాబోలు, కుయ్యి, కుయ్యిమని అరుస్తోంది.


గదిలో ట్యూబ్‌లైటు వేసి, మళ్ళీ వచ్చి సోఫాలో కూర్చున్నాడు నరసింహంగారు.

టింగ్‌టింగ్‌మని చప్పుడుచేస్తూ గుప్పున వెలిగింది ట్యూబులైటు. మూలని నక్కి ఉన్న ఎలకని టార్చిలైటు వేసి మరీ పిల్లి పట్టుకొన్నట్టనిపించింది వరప్రసాదరావుకి.

చిరుచలితో ఉన్న ఆ కుర్రాణ్ణి చూస్తే తువ్వాలిచ్చి 'తల తుడుచుకో'మని చెప్దామన్న ఆలోచన నరసింహంగారికి మెరుపులా మెరిసింది కాని, అంతలోనే ఆ ఆలోచన చప్పగా చల్లారిపోయి, అంతరాంతరాల్లో ఎక్కడో ఇరుక్కుపోయింది.

''మా ఫాదరిన్లాని నువ్వెరుగుదువా?''

నరసింహంగారి వేపు చూశాడు ప్రసాదరావు. బితుకుబితుకుమంటూ, ఆయన ఒక్క పిసరు వెనక్కితిరిగి తన వెనకాతల ఉన్న ఫొటోని చూశాడు. ఆ ఫొటోని చూస్తూనే నరసింహంగారి ముఖం ఒక విధమైన తేజస్సుతో వెలిగిపోయింది.




వరప్రసాదరావు మళ్ళీ ఆ ఫొటోచూశాడు. అతనింతకు ముందు గమనించలేదు గాని, ఆ బొమ్మలోని పెద్దమనిషి చిన్న నవ్వు నవ్వడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ నవ్వు, శవం నవ్వినట్టుంది, పరమ భయంకరంగా ఉంది. కళ్ళు దించేసుకొన్నాడు ప్రసాదరావు.

నరసింహంగారు గొంతు సవరించుకొన్నారు.

''నువ్వెరుగవులే! మీ తాతగారికి బాగా తెలుసును. కాని, అబ్బాయ్! చెప్తున్నాను, అలాంటి మనిషి నూటికో కోటికో ఒక్కరుంటారు. ఆయన ఎన్ని పుస్తకాలు చదివేరు? ఎంతజ్ఞానం సంపాదించారు? ఆయన్ని చూస్తూ ఉంటే, మనం ఎప్పటికైనా ఈయన సంపాదించిన జ్ఞానంలో నూరోవంతు సంపాదించగలనా? అని నాకనిపించింది కాని, చెప్తున్నాను విను, నెవర్, నెవరిన్ మైలైఫ్. నేను మాత్రం ఇప్పటిదాకా సాధించలేక పోయాను. అంత పండితుడాయన. అలాంటి దైవభక్తుణ్ణి మళ్ళీ మరోణ్ణి చూళ్ళేదు నేను. ఈ రోజుల్లో చదువుకొన్న ప్రతి గాడిదా దేవుడు లేడు, దెయ్యం లేదు అంటూ బయల్దేరుతున్నారు గాని, వీళ్ళందరూ లేడనేస్తే పోతాడాఏమిటి? వాడ్దాయూసే? నువ్వు నమ్ముతావా? నమ్మవా...'' అని ఆగాడు నరసింహంగారు.

వరప్రసాదరావు ఏదో చెబ్దామని నోరువిప్పాడు కాని, అతను చెబ్దామనుకొన్న ముక్కలు గొంతుకడ్డం వచ్చి గుటకతో మింగుడు పడిపోయాయి.

నరసింహంగారు ఏవనుకొన్నారో, ఏమో మళ్ళీ మొదలెట్టాడు.

''మాట వరసకి నా ఎల్డెస్ట్‌సన్, నా డాటరిన్లా, వాళ్ళ పిల్లలూ అంతా చదువుకొన్నవాళ్ళే! బట్ దే ఆర్ ఆల్ గాడ్ ఫియరింగ్ పీపుల్. ప్రతి ఏడూ పిల్లలకి పరీక్షలయిపోగానే మనవేపువస్తారు. మా పెద్దవాడూ, మగ పిల్లలూ అంతా తిరుపతిలో తలనీలాలు సమర్పించుకు మరీ వెళ్తారు. అందులోనూ, నా ఎల్డెస్ట్ గ్రాండ్సన్ అచ్చు మా ఫాదరిన్లా పోలికే వాడిది. వాడు బాంబే ఐఐటీలో కెమికల్ టెక్నాలజీ చదువుతున్నాడు. వాడు మరి ఏ పనిచేసినా ఆ ఏడుకొండలవాణ్ణి తల్చుకోందే చెయ్యడు... చెప్పొచ్చేదేవిటంటే, మా మావగారికి అంతదైవభక్తి...''

వరప్రసాదరావు నోరు కొంచెం వేళ్ళాడేసుకొని వింటున్నాడు. వింటున్న కొద్దీ అతనికి వెన్నుపూసలో వణుకు ఎక్కువవుతోంది.

''ఆయన కోర్టుకెళ్తే అర్ధణా కేసులూ, అణా కేసులూ ఎప్పుడూ చూసేవారు కాదు. నేను కొత్తగా ప్రాక్టీసు పెట్టిన రోజుల్లోనే నాతో చెప్పారు. 'నాయనా, నరసింహం! మనకున్న ఆస్తి ఇప్పటికైనా, ఎప్పటికైనా చదువు ఒక్కటే కదా! అంచేత మనం మన చదువు సంధ్యల్ని అలగా వెధవలకీ, అడుక్కు, తినే వెధవలకి దానం చేస్తే, ఆఖరికది మనకే బెడిసికొట్టి మనల్ని కూడా వాళ్ళతో తత్తుల్యుల్ని చేసేస్తుంది. అందుకే అపాత్రదానం కూడదన్నారు. మరింక బతకలేం అంటావూ, ఈ వెధవ మురికి కేసులూ, ముష్టికేసులూ చూసుకొంటూ బతకడం కన్న ఆ పరమేశ్వరుడి సాన్నిధ్యానికి పోవడం నయం కాదూ!' అన్నారు. అంతే! అన్నమాట నిలబెట్టు కున్నారు. ఆ వేళ నేనూ వెంకటేశ్వరుడి సాక్షిగా ఒట్టు వేసుకొన్నాను... అది ఖూనీ కేసు కానీ, ప్రోనోటు కేసు కానీ, పార్టీ వచ్చి బాబూ! రక్షించు అని అడిగితే, 'అబ్బీ! ఇంతవుతుంది' అని చెప్పి డబ్బుకి డబ్బు ఖరాఖండిగా పుచ్చుకొనే వారు. పనికి పనీ కరాఖండిగా చేసే వారు''.

ఎక్కువగా మాట్లాడుతున్నానేమోనని సందేహం వచ్చి ఒక క్షణం ఆగారు నరసింహంగారు. కాని చెప్తున్నది హైక్లాస్ డిగ్నిఫైడ్ లైఫ్ గురించే కాని లోక్లాస్ రెచెడ్ లైఫ్ గురించి కాదుకదా!

చిన్న నవ్వు నవ్వి ''ఇప్పుడు తల్చుకుంటే నాకే నవ్వొస్తోంది. ఓసారి నా చిన్నతనంలో అమాయకంగా నేనాయన్ని అడిగాను. 'అయితే, మావగారూ! ఖూనీ చేసినవాణ్ణి రక్షిస్తే, అది దుష్టరక్షణ అవుతుంది కదా! అది పాపం కాదా?' అని ఆ ప్రశ్నకి అబ్బాయి చెప్తున్నాను. మరెవరైనా అయితే ఊరంత కోపం తెచ్చేసుకొనేవారు. కాని ఆయన మాత్రం అంతా విని చిన్న నవ్వు నవ్వి 'అది కానేకాదోయ్! మనం చేస్తున్నదేవీ లేదు. ఆ చచ్చిపోయిన

వాడు వీడిచేతుల్లో చావ్వలిసుండి, వీడికి వాణ్ణి చంపాలిసుండి, వీడు బతక వలసుండి మన దగ్గరకు రావలిసున్నప్పుడు మధ్యలో మన మెవళ్ళమోయ్, దుష్టరక్షణ అవునా కాదా? అని ఆలోచించడానికి ఆ జగత్పాలకుడి చర్యల్ని ప్రశ్నించడానికి నువ్వుగాని, నేను గాని ఎవళ్ళ మైనా ఎవళ్ళమోయ్? ఎవడి కర్మ పరిపాకం ఎలా ఉంటే అలా జరుగు తుంది' అని ఆయన సులువుగా చెప్పారు'' అన్నారు నరసింహంగారు.

అలా గోడకుర్చీ వెయ్యడం వల్ల వరప్రసాదరావు కాళ్ళు తిమ్మిరెక్కి వణు కుతున్నాయి. మెడ నొప్పిడుతోంది. తలెత్తి చూశాడు. ఎదురుగా ఫొటోలో ఉన్నాయన, 'బతుకులో ఇంకా అంతు చూడాల్సినవి ఎన్నో ఉండగా, అప్పుడే ఇలాగ చచ్చి శవాన్నయిపోయానే' అన్న అసూయతో బతికున్న వాళ్ళని శపిస్తున్నట్లు చూస్తున్నాడు. వెంటనే కళ్ళు తిప్పేసు కున్నాడు వరప్రసాదరావు.

''ఇంతకీ నేను చెప్పిందేవిటంటే, ఆయన లా పుస్తకాలు ఎంత క్షుణ్ణంగా చదివారో, ధర్మశాస్త్రాలు, శ్రుతులు, స్మృతులూ అంత క్షుణ్ణంగానూ చది వారు. ఎప్పుడూ చదువు, చదువు, చదువు చేస్తే కోర్టు పని చెయ్యడం లేక పోతే ఒక పుస్తకం చదువుతూ ఉండటం. ఆఖరి రోజు దాకా ఆయన కోర్టుకి వెళ్తానే ఉన్నారు. ఆ ఫొటో పోయిన వెంటనే తీసింది.... ఓసారి లాగే...'' నరసింహం గారు టక్కుమని ఆగిపోయాడు.

బైట వరండాలో ఏవో మాటలు వినిపించాయి. అంతలోనే ఎవరో తలుపు దబదబ కొట్టారు. నరసింహంగారికి చిరాకేసింది. ''కాల్ బెల్ ఉంటే, తలుపు బాదుతారు...'' అంటూ లేచి వెళ్ళాడాయన.

సోఫాలో సరిగా కూర్చుందామనుకొన్నాడు వరప్రసాదరావు కాని, వెంటనే 'ఇంతసేపూ ఒకలా కూర్చుని, ఇప్పుడొకసారి దర్జాగా కూర్చుంటే బావుంటుందా?' అని ధర్మ సందేహంలో పడ్డాడు.

వరండాలో లైటువేసి, తలుపు తీశాడు నరసింహం గారు.

తలుపు తీసిన నరసింహంగారికి, అవతల వరండాలో వానలో తప్ప తడిసి పోయిన ఒక ముసలివాడూ, ఒక పడుచుపిల్ల కనిపించారు. ఒంటికి గుడ్డలు అంటుకుపోయి, ముసలివాడి ఎముకలూ, పడుచుపిల్ల ఒంపులూ నరసింహం గారికి స్పష్టంగా కనిపించాయి.

నరసింహం మొహంలో మారుతున్న రంగుల్ని ఆ మనిషి గమనించ లేదు. ''వొరసంలో తడసిపోనం. మా తాతకి జొరంగుంది. కుసింతసేపు లోపల కూసుంటాం బాబూ?'' అంది.

కళ్ళు మిరిమిట్లు గొలిపేలా ఓ మెరుపు మెరిసింది.

నరసింహంగారికి మొదట అర్థంకాలేదు. ''ఎవర్నువ్వు? ఏవిటి కావాలి?'' అని ఆయన గర్జించినట్టు అడిగాడు.

''మా తాతకి జొరం. వొరసం తగ్గేదాక లోపల కూసుంటాం బాబూ! దా దా, ముసిలీ!'' అందా మనిషి మళ్ళీ.

నరసింహంగారికి అంతా అర్థం అయింది.

ఎక్కడో పిడుగు పడింది.

''నించో, ఎవడొద్దన్నాడు? నించోండి'' అన్నాడాయన కొంత తగ్గి.

''వొరండాలో జల్లు కొట్టేస్తున్నది బాబయ్యా! మా తాత తడిచి పోతు న్నాడు. జొరంగుంది బాబూ! వొక్క సిటం కూసుండి పోతాం తండ్రీ!''

''బావుంది! ఏదో సావెత చెప్పినట్టుంది. గదిలో దూరిపోతానంటుందే ఏటిపిల్లా? వరండాలో నించోమంటే నీక్కాదూ?'' అంటూ తలుపు వేసే శాడు నరసింహంగారు.

''బాబూ! బాబ్బాబూ!'' అంటూనే ఉందామనిషి.

''పోనీ, ఇక్కడే నించుందాం, పోన్లేయే!'' అంటూ ముసలతనివి కాబోలు, నూతిలోంచి వచ్చినట్టు మాటలు విన్పించాయి.

నరసింహంగారు రొప్పుతూ వచ్చి, సోఫాలో కూర్చున్నాడు.


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040-23747777 , 9391999999



FREE online Registration &
Free search
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | |
|---|---|
| అమీర్‌పేట | నెల్లూరు |
| కూకట్‌పల్లి | తిరుపతి |
| దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు |
| విజయవాడ | (చెన్నయ్) టి.నగర్ |
| గుంటూరు | బెంగుళూర్ |
| తెనాలి | సేలం |
| విశాఖపట్నం | మధురై |
| రాజమండ్రి | వెల్లూరు |
| కాకినాడ | తిరుచి |
| ఖమ్మం | పాండిచ్చేరి |
| ఒంగోలు | ఈరోడ్ |
| | ఏలూరు |

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.


''చూడు! ఆ ముండ అధార్టీ! లోపలికి వచ్చేస్తుందిట! లోపలికి! ఇదేం ధర్మసత్రవనుకొందో, దీని బాబుగారు కట్టించిన ఇల్లనుకొంటోందో? ఆ ముసలి వెధవచూడు, ఇప్పుడా మరో క్షణంలోనో అన్నట్టున్నాడు. వరం డాలో నించోనిస్తే గదిలోకి వస్తానంటోంది. ఆ తరువాత, దాని సొమ్మేం పోయింది. ఆ జబ్బువెధవకి మంచలియ్యమంటుంది. 'నాయనా, బాబూ' అని బతిమాలితే లొంగిపోయి లోపలికి రానిస్తాననుకొంటోంది కాబోలు, దొంగముండ, పోనీకదా అని రానిస్తావనుకో. తీరా, ఆ ముసిలాడు ఇక్కడే గుటుక్కుమంటే, వెధవకి ఏం రోగవో, ఊష్ణం అంటోంది. ఏమో,. ఏ విషజ్వరవో ఎవరికి తెలుసు? ... వరండాలో నించోమన్నాను కదా? మరోడయితే గేటుదాటి లోపలికెందుకొచ్చావని తగిలేసును!.... ముసిలాడు బాగా తడిసి పోయినట్టున్నాడు. ఊరికే వణికి పోతున్నాడు. జబ్బులొచ్చాయంటే రావు మరి? ఓ చదువా సంధ్యా, వల్లకాడా, వసినదిబ్బా? మళ్ళీ వెధవలింటిల్లి పాదీ సంపాయిస్తారు. ఓ కాణి మిగల్చడం ఏవన్నా ఉంటుందా? అదేవీ లేదు. తాగేసి తందనా లాడటం... పోనీ ఉంటున్నచోట ఏవన్నా శుభ్రం అదీ ఉంటుందా? జబ్బు లొచ్చాయంటే వాటిదా తప్పు?'' గుక్క తిప్పుకొన్నాడు నరసింహంగారు.

వరప్రసాదరావుకి నరసింహంగారి వేపు చూడ్డానికే భయం వేస్తోంది. సరిగ్గా వెనకాతల ఆయన తలమీద ఉన్న మావగారి బొమ్మ, ఆయన్ని ఆవ హించిన దెయ్యంలా కన్పించిందతనికి. తిమ్మిరెక్కిన కాళ్ళు, స్వాధీనం లోకి రావడం లేదు. లేస్తే తూలిపడిపోతానేమో ననిపించిందతనికి.

''చెప్పలేదుబ్బాయ్! కీడెంచి మేలెంచమన్నారు. ఆ ముసిలాడికి నిజంగా జ్వరం లేదేమో! ఇద్దరూ దొంగవెధవలేమో ఎవడు చెప్పగలడు. అందు లోనూ, ఈ రోజుల్లో దొంగతనానికి సవాలక్ష మార్గాలు. కాయకష్టం చేసి బత

కడం మానేసి దోచేసుకు బతికేద్దాం అనుకొనే వెధవలికి మరి ఈ పోలీసులూ, ఈ కోర్టులూ లాభం లేదబ్బాయ్! నన్నడిగితే, దొంగ వెధవలు దొరికితే, నలుగురూ కలిసి చితకతన్నేయాలి. అట్టే మాట్లాడితే. అక్కడే కాల్చి పారెయ్యాలి. దెబ్బతో మరెవరూ దొంగతనాలకి దిగడు''

నరసింహం గారి ముఖం ఎర్రగా దుంపలా అయిపోయింది. ఆవేశంలో ఊగిపోతున్నాడాయన.

బైటవానకి గాలి తోడయింది. ఊరూ వాడా ఏకవయినంత వాన కురుస్తోంది. వరండాలో మాటలు వినిపించడం లేదు. వరండాలో వది లేసిన జోళ్ళు ఓసారి గుర్తొకొచ్చాయి కాని ఆ భయంలో, ఆ చిరుగాలిలో ఆమాటే మర్చిపోయాడు వరప్రసాదరావు. ఇంతలో – మళ్ళీ తలుపు దబదబ బాదారెవరో. ఈసారి ఆగకుండా బాదుతున్నారు.

వరప్రసాదరావు లేచి వెళ్దామనుకున్నంతలో, చివాల్న నరసింహంగారే వెళ్ళాడు. ఆయన అరికాలిమంట నెత్తికెక్కింది. వరప్రసాదరావు గుండె ఒక్కసారి కొట్టుకోవడం, మానేసి, మళ్ళీ గబగబా కొట్టుకుంది. ప్రళయవేళ రుద్రుడిలా ఉన్నారు నరసింహంగారు.

నరసింహంగారు, కోపమంతా తలుపుమీద చూపించి, తలుపు తీశాడు. ఆయన ఇలా తలుపు తియ్యడం ఏమిటీ, సర్రమని గాలీవానాతో పాటు ఆ పడుచుపిల్ల ముసలతని పట్టుకొని లోపలకు రావడం ఏమిటి మెరుపు మెరిసినంతలో జరిగిపోయాయి. నరసింహం గారు కొంచెమాగి, వెనక్కి జరిగాడు.

''ఏయ్! వ్వాటీజ్ దిస్? ఏవిటీ దౌర్జన్యం? చెప్తూ ఉంటే నీక్కాదూ? నువ్వు మనిషినా పశువ్వా? గెటౌట్? పొండి ముందు! వూ! బయటికి పొండి'' అని అరిచారు నరసింహంగారు.

ఆ మనిషి నోరు మెదపలేదు. వరప్రసాదరావు వేపు ఓ చూపు చూసిందావిడ కాని ఆ కుర్రవాడు తన భయంలో తనుండి, ఆ చూపుల్ని గమనించలేదు ఆ మనిషి మౌనం నరసింహం గారిని మరింత రెచ్చ గొట్టింది.

''పోతారా, పోరా? పోలీసుల్ని పిలిపిస్తాను. ఏవనుకొంటున్నారో? మర్యాదగా పొండి! క్విక్ గెటౌట్!''

ఆవిడ అప్పటికీ ఏం మాటాడలేదు. హోరున వాన చప్పుడు, చెవుల్లో గింగురుమంటోంది. వాన దబాయించి కురుస్తోంది. తీసిన తలుపు లోంచి వరండాలో జల్లు, గదిలోకి కూడా వస్తోంది. చల్లటిగాలి ఉండుండి వీస్తోంది.

తోక మీద లేచిన పాములా నిల్చున్నాడు నరసింహం గారు. ఆ మనిషి, ముసలతని చేతిలో కర్ర తీసుకొని, అతన్ని గోడకి చేరువగా కూర్చో బెట్టింది. చేతిలో సంచినీ, కర్రనీ ఆ పక్కనే ఉంచింది. జుత్తు ముడి విప్పుకొని దులుపుకొంది.

నరసింహంగారు ఈ అవమానాన్ని సహించలేక పోయాడు. ''రాస్కెల్స్! మీరిలాగ పోరు! పోలీసులకి ఫోను చేస్తాను'' అంటూ ఫోను దగ్గరికి నడిచాడాయన.

జుత్తు ముడివేసుకొని, కొంగుబిగించి కొంచెం ముందుకొచ్చిందా అమ్మాయి. ఈ క్షణంలో ఏ సిద్ధుడో వచ్చి తనని మాయం చేస్తే బావుండుననుకొన్నాడు వరప్రసాదరావు.

''ఏటి బాబు! పోలీసుల్ని పిలిపిస్తాన్ పోలీసుల్ని పిలిపిస్తావ్ అని జడిపిస్తు న్నావ్. పిలు బాబు! పిలు. అంతకంటె నువ్వు మాత్తరవేటి సెయ్యగలవూ! ఆలు నీ సేతిలున్నారు గనక ఆల్ని పిలుస్తావ్. పోలీసోల్లని కాకపోతే మిలిట్రోల్ని పిలు! ఏటి నానేవి నీ వొంటిమీద సెయ్యేసినానా? నీ ఇల్లడిగినానా, నీ కోకలడిగినానా, నీ డబ్బుడిగినానా? ముసలి ముండా కొడుకు నిస్కారనంగా సచ్చిపోతాడు. వొరసం వొగ్గగానే పోతాం బాబూ! అన్నాను. అంతేనా, అంతకంటేటైనా అధికంగా అడిగినాన? సెప్పు'' అందా మనిషి మర్యాదగానే.

''ఈ వెధవ కబుర్లు చాలు గాని, ఫో బయటికి ఐ విల్ నెక్ యూ అవుట్. మిమ్మల్ని మెడ పట్టుకుగెంటేస్తాను. పొండి ముందు!'' అరిచాడు నరసింహం గారు, ఫోను ఎత్తుతూ.

''ఏటి బాబు! మరియాదగ నాయ్నా బాబుఅంటే బిర్రబిగిసి పోతున్నావు. నానెల్లను బాబూ! మావెల్లం. ఇక్కణ్ణుంచి ఒక్కడుగు కదలం. ఏటి సేత్తానో సెయ్యి. వొరసం వొగ్గాల, మావు కదలాల. నీ సిత్తం కొచ్చింది సెయ్యి. పోలీసోల్లనే పిలిపించుకుంటావో, మిలట్రోల్లనే పిలిపించుకొంటావో నీ య్యిష్టం. కూసోరా ముసిలీ!'' అంటూ లేచిపోతున్న ఆ ముసలతన్ని కూర్చోబెట్టి, అక్కడే ఉన్నకిటికీలో కూర్చుంది ఆ పడుచు పిల్ల.

నరసింహంగారు ఫోను దించేశారు. పడుచుపిల్ల వయసు చూసి దించేశారో, ముసలతని జబ్బు చూసి దించేశారో, ఇది అపాత్రదానం కాదని తమని తాము నమ్మించుకొనే దించేశారో, పోలీసుల్ని ఇంట్లోకి రానివ్వడం కోరి శనిని ఇంట్లోకి తెచ్చుకోవడమే అనుకొని దించేశారో – ఎందుకో గాని మొత్తం మీద ఫోను దించేశారు నరసింహంగారు.

''వెధవలకి చెప్తే అర్థం కాదు'' అంటూ గొణుక్కొన్నాడు.

నరసింహంగారు కచ్చ సర్దుకొంటున్నారు. గోడ మీద ఫొటో బోనులో బంధింపబడ్డ పులిలాగ, సీసాలో దిగబడిన పిశాచం లాగ గిలగిల లాడుతోంది.

వరప్రసాదరావు తీవిగా సోఫాలో వెనక్కి జారబడి, బేక్ పాకెట్‌లోంచి దువ్వెన తీసి, జుత్తు మీదకి దువ్వుకొన్నాడు. రుమాలుతో ముఖం తుడుచుకొన్నాడు.

వరండాలో వానజల్లు పడుతూ తివాచిని తడిపేస్తోంది.

✻

–స్వాతి మాసపత్రిక, జులై 1971



## పద్ధతిగా ఉంటా!

ఈ మాట మరెవరి నోటి నుంచి వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కానీ, బాలీవుడ్‌లో సెక్స్‌బాంబ్‌గా పేరొందిన కంగనారౌత్ నోటి నుంచి వచ్చింది కాబట్టి తప్పనిసరిగా ఆశ్చర్యపోవలసిందే! ఇప్పటి వరకూ కురచ దుస్తులు వేసుకొని అభిమానులకు కనువిందు చేసిన కంగన ఇప్పటికిప్పుడు ఎందుకింత కఠోర నిర్ణయం తీసుకుందో అర్థం కాక బాలీవుడ్‌లో పలువురు తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. మరో పక్క కంగనా స్టేట్‌మెంట్ ఆమె అభిమానులకు మింగుడు పడడం లేదట! దీనికీ ఓ కారణం ఉంది. ఇటీవలే కంగనా జాతీయ స్థాయిలో ఓ సినిమాకి 'సహాయ ఉత్తమ నటి' అవార్డునందుకుంది. ఈ అవార్డు అందుకొన్న తరువాత కంగనాకి జ్ఞానోదయం అయిందని పరిశ్రమలోని వారంటున్నారు. ఇక నుంచి 'ఉత్త' నటిగా కాకుండా 'ఉత్తమ నటి'గా కొనసాగాలని నిర్ణయించుకొందనీ, అందుకే ఈ నిర్ణయం తీసుకొందని వారు చెబుతున్నారు. ఈ విషయంలో కంగనా ఒకప్పటి అందాల నటి 'మాధురీ దీక్షిత్'ని ఆదర్శంగా తీసుకుంటోందట! అన్నీ బాగానే ఉన్నా, కంగనా ఎంత కాలం తన మాట మీద నిలబడుతుంది? అన్న అనుమానంతో సినీపరిశీలకులు తలలు పట్టుకుంటున్నారు.